# ఆడది-అర్ధాంగి

## ఎ. సువర్ణ

విశ్వం వచ్చాడు....విశ్వం వచ్చాడు...అని ఆమె మనసులో రెండు మూడు సార్లు ప్రతిధ్వనించింది. మామూలు కంటే గుండె వేగంగా కొట్టుకోవడం ఆమెకే తెలుస్తోంది. కోకిలకి రెండేళ్లలో కన్నుల పండువుగా మారిన విశ్వం విగ్రహం కన్నుల పండుగగా చూస్తోంది.

"అమ్మాయ్ కోకిలా! ఎంతసేపని అద్దం ముందు కూర్చుంటావు. అమెరికా వెడతానని చెప్పేందుకొచ్చాడా నలకూబరుడు...తొందరగా కిందికి దిగొచ్చి అతనితో నాలుగు మాటలు మాట్లాడు. ఆ గయ్యాళి దాని కొడుకుతో..."అన్న తల్లి మాటలకు కోకిల నవ్వుకుంది.

అసలే...అదే అమ్మ అన్నట్లు నలకూబరుడంత అందగాడైన విశ్వానికి ఎమ్.బి.ఎ ర్యాంక్ హోల్డరనే కిరీటం తలమీదకొచ్చి మరింత అందగానిగా చేసింది....అనుకుంటూ కిందికి దిగి వచ్చి వంటింట్లో వున్న తల్లి దగ్గరకు వచ్చింది కోకిల.

"ఇంద ఈ కాఫీ పలహారాలు తీసికెళ్ళి ఆ అహంభావి కొడుక్కి ఇచ్చి నాలుగు మాటలు మాట్లాడు..."అన్న తల్లి మాటలు కోకిల మనసు మీద దెబ్బ కొట్టినట్లయింది.

అమ్మ అత్తని ఎంత తేలిగ్గా గయ్యాళి, అహంభావి అంటున్నది. ఎంతైనా ఆడబడుచుగా...పైగా బి.ఎ వరకూ చదువుకుని ఉద్యోగం చేస్తున్నది. అత్త ఏ పని చేసినా నాలుగు మాట్లు ఆలోచించి చేస్తుంది. అందరితోనూ ఆచితూచి అతి జాగ్రత్తగా మాట్లాడుతుంది. మనసు నొప్పించే మాట అసలు అనదు...అమ్మ అందుకు పూర్తిగా విరుద్ధం.

"అమ్మా కోకిలా! రామ్మా...విశ్వం వచ్చాడు" అన్న తండ్రి మాటలలోని ఉత్సాహం కోకిలకెంతో ఆనందాన్నిచ్చింది.

కాఫీ పలహారాలు ట్రే పట్టుకొస్తున్న కోకిలను చూస్తూనే ..."ఎవరీ అమ్మాయి మామయ్యా?..." అని అడిగిన విశ్వం "ఓ...మన కోకిల కదూ..ఇన్‌క్రెడిబుల్ మామయ్యా...మూడేళ్ళ కిందట నేను చూసినప్పుడు చిన్న పిల్లలా రెండు జడలేసుకుని వీడియోగేమ్స్ ఆడుతుండేది...మైగుడ్‌నెస్ ఎంత పొడుగు ఎదిగింది?...నా కళ్ళని నేనే నమ్మలేకపోతున్నాను



మామయ్యా...'' అన్న విశ్వం మాటలకి కోకిలకెంతో సిగ్గుగా వుంది...నువ్వు కూడా...అని మనసులోనే అనుకుంది కోకిల.

సరిగ్గా షేవ్ చేసుకోవడం రాక సగం సగం మీసాలతో వున్న నిన్ను చూసి ఆడపిల్లలందరూ ఆటపట్టించేవారు...ఇప్పుడు చక్కగా షేవ్ చేసుకుని నీట్‌గా డ్రస్ చేసుకుని రాజకుమారుడిలా మెరిసిపోతున్నావు... ఇప్పుడొచ్చిన కొత్త డిగ్రీ వల్ల ఆత్మవిశ్వాసం పెరిగిపోయి అది మోహాన్ని మరింత కాంతివంతం చేసింది.

"కూర్చోమ్మా..." అని కూతురు చేతిలోంచి ట్రే తీసుకుని టీపాయ్ మీద పెట్టాడు కోకిల తండ్రి సాంబశివయ్య.

అప్పుడక్కడికొచ్చిన భార్యతో "అక్కయ్య సుపుత్రుడు పైచదువులకని అమెరికా వెడుతున్నాడు...చదువు పూర్తి చేసుకుని తిరిగి మన దేశం వచ్చేసరికి మన కళ్లకి కనబడనంత ఎత్తుకు ఎదిగిపోతాడు" అన్నాడు గర్వంగా సాంబశివయ్య.

"మామయ్యా! ఇప్పుడే నేను ఆరడగుల పొడుగు...ఇంక పైన ఎదగను మామయ్యా..."అన్న అతని మాటలకు అందరూ నవ్వేశారు.

వాకిట్లో ఎవరో పిలవడంతో సాంబశివయ్య లేచి వాకిట్లోకి వెళ్ళాడు. భార్య భర్తననుసరించింది. అక్కడ కోకిల విశ్వం మాత్రమే వున్నారు.

"ఆ(....కోకీ, ఇప్పుడు చెప్పు. నువ్వేం చదవాలనుకుంటున్నావు...?"అడిగాడు విశ్వం కోకిలను.

"ఇంటర్ మీడియెట్ పూర్తి చేశాను...ఏదైనా డిగ్రీకోర్సులో చేరదామనుకుంటున్నాను" అన్న కోకిల మాటలు విశ్వానికి కోపాన్ని తెప్పించాయి.

"అదేంటి కోకీ! ఏదైనా అని అంటావు...ఇదే చదవాలనే కోరిక, పట్టుదల ఏమీ లేవా నీకు...?" అన్న విశ్వం మాటలు అర్థం కానట్లు అతన్ని చూసింది కోకిల.

"ఆడపిల్లలకో వ్యక్తిత్వం వుండాలని, వాళ్లకంటూ కొన్ని కోరికలు, ఆశలు వుంటాయని అంటారే కాని అవి చేతల్లో కనిపించడం లేదు. అమ్మాయిలందరికీ మొదట వాళ్లకంటూ ఓ సొంత అభిప్రాయం వుండాలి. ఆ తరువాత అది ఆచరణలో పెట్టగలిగే ఆత్మవిశ్వాసం, చొరవ, పట్టుదల వుండాలి...తల్లిదండ్రులు తమ కూతుళ్లకి చిన్నప్పటి నుంచీ ఈ గుణాలను వాళ్ల మనసులలోకి ఇంజెక్ట్ చెయ్యాలి...అలా చేస్తే ఇదిగో నీకు మల్లే ఏదో డిగ్రీ అనో...నాన్నగారి ఇష్టం, కట్టుకునేవాడికిష్టం వుండదనో అని అంటారు...

మామయ్య నీకిష్టం వచ్చిన చదువు చెప్పించేందుకు సిద్ధంగా వున్నప్పుడు నీకంటూ ఆలోచించి ఓ మంచి కోర్సుని సెలెక్టు చేసుకోవచ్చునుగా..." అంటూ విశ్వం కోకిలకు బ్రెయిన్‌వాష్ చేశాడు.

అప్పటి నుంచీ కోకిలలో పట్టుదల, ఆత్మవిశ్వాసం విశ్వరూపం ఎత్తినై.

మెరైన్ ఇంజనీరింగ్ తప్ప మరే కోర్సులోనూ చేరనంది. ఇంతవరకూ ఆడపిల్లలెవరూ చదవని కోర్సు తనే మొట్ట మొదటి అమ్మాయి అవాలని కోకిల పట్టుదల...

కలకత్తాలో సీటు వచ్చి మెరైన్ ఇంజినీరింగ్‌లో చేరింది కోకిల.

"నాన్నా! నాకు చెకోవ్, దోస్తవయస్కీ రచనలంటే ఎంతో ఇష్టం. పత్రికల్లో ఆయన నవలల పరిచయం చదివాక రష్యన్ భాష నేర్చుకుని ఆ భాషలో వాళ్లు రాసిన నవలలు చదవాలనుంది..."అని రష్యన్ భాష నేర్చుకుంది.

స్త్రీల పురోభివృద్ధి చర్చాకార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని స్త్రీలలో చైతన్యం వచ్చేట్లుగా ఉపన్యాసాలు ఇచ్చింది.

"చర్చా కార్యక్రమం మొదలవబోతోంది.హాలులోకి వెడదాం పదండి నాన్నా..."

"మాట్లాడే అంశం ఏమిటి నాన్నా!..."అని అడిగింది కోకిల తండ్రిని. ఎందుకంటే ఆనాటి చర్చనీయాంశం కోకిలకు తెలియదు. సెలవుల్లో ఇంటికొచ్చిన కోకిలకు స్త్రీల కార్యక్రమాలంటే ఇష్టమని తండ్రే ఆ కార్యక్రమానికి కూతుర్ని తీసుకొచ్చాడు.

"పతివ్రతలలో సీత గొప్పదా...సావిత్రి గొప్పదా?-అనేదే నేటి చర్చనీయాంశం"అని తండ్రి కూతురికి చెప్పాడు.

"ఇదేం టాపిక్ నాన్నా?..."అన్న కూతుర్ని ఆశ్చర్యంగా చూశాడు తండ్రి. "ఏం అమ్మా పాతివ్రత్యం,మానం అనేవి కేవలం ఆడవాళ్ళకి మాత్రమే అన్నట్లుగా లేదూ ఈ అంశం..."

"ఈ పిల్లకేమైంది...టామ్ అండ్ జెర్రీ లాంటి కామిక్ పుస్తకాలు చదువుతూ, టీ.వీ అల్లావుద్దీన్ అద్భుతదీపం సీరియల్ చూస్తూ, వీడియోగేమ్స్ ఆడుకున్న నా కూతురు కోకిలేనా?"అని మనసులో అనుకుని ఆశ్చర్యపోతున్నాడు సాంబశివయ్య.

రష్యన్‌భాష నేర్చుకోవడం అంత తేలిక కాదు అని అనుకుంటుండగానే కోకిల ఆరు నెలల్లో రష్యన్‌భాష పూర్తిగా నేర్చుకుని ఆ భాషలో ప్రముఖుల రచనలు చదవడం ఆరంభించింది.

కామిక్స్ తప్ప వేరే పుస్తకాలు చదవని కోకిల ఇప్పుడు చదివే పుస్తకాలన్నీ సాహిత్య అకాడమీ బహుమతులు పొందిన రచయితల రచనలే...

సీతాకోక చిలుకల వెనకాల పరిగెత్తే కోకిల ఇప్పుడు వెబ్‌సైట్ ముందు కూర్చుని ప్రపంచంలో మూలమూలలో జరిగే సమాచారాన్ని తెలుసుకుంటున్నది...


ఒక పేపరు అరియర్సు అయిన ఓ స్నేహితురాలు ఏడుస్తూ కూర్చుంటే...ఆమెకు "చిన్న చిన్న ఓటములు మన జీవితాలకు ఎరువుల మాదిరి..."అని ఫ్రెండ్‌ని ఓదార్చింది కోకిల.

"ఫస్ట్ క్లాస్ టిక్కెట్టు వున్నా గాంధీగారిని రైల్లోంచి కిందకి దించెయ్యలేదూ...ఏడుసార్లు ఎలక్షన్‌లో ఓడిపోయినా లింకన్ పట్టుదలగా పోటీ చేసి అమెరికన్ ప్రెసిడెంట్ అవలేదూ?

పట్టుదలతో కష్టపడి చదివావంటే ఫస్టు క్లాసులో పాసవుతావు..."అని స్నేహితురాలిని ఉత్సాహపరిచింది కోకిల.

ఇంత ఆత్మవిశ్వాసం కోకిలలో రావడానికి కారణం ఏమిటని కోకిల తనను తానే ప్రశ్నించుకుంది.

"ప్రేమేగా!" అన్న ప్రశ్నకి అవును అన్న






"రాష్ట్రాలు" దేనికోసం?

కేంద్రం "అయిదుపైసలు" పెంచితే, రాష్ట్రాలు "అయిదు రూపాయలు" పెంచడానికి!

* * *

"మంత్రులు" దేనికి?

"శంఖుస్థాపనలు" చెయ్యడానికి!

* * *

"నగరపాలక సంస్థలు" ఎందుకు?

"అది చేస్తాం" - "ఇది చేస్తాం!" అని చెప్పడానికి!

* * *

"విమానాలు" దేనికి?

"తారలూ - నాయకులూ" ప్రయాణాలు చెయ్యడానికి!

* * *

"ఆంధ్రరాష్ట్రం" యొక్క "ఆర్.టి.సి." సాధించినదేమిటి?

"చెయ్యెత్తి ఆపితే ఆగడం!"

* * *

"కోర్టు"లెందుకు?

"చెప్పులు" అరగడానికీ - "ఆస్తులు" కరగడానికీ!

* * *

ఒకే "కాన్పు"లో "నలుగురు పిల్లలు" పుడితే...?

కొంప "పాలడబ్బాల ఫ్యాక్టరీ" అయిపోతుంది!

* * *

కళ్లముందు "స్వర్గం" ఎప్పుడు కనబడుతుంది?

దోడ్లో "లంకెబిందెలు" దొరికినప్పుడు!

* * *

మరి "నరకం" ఎప్పుడు కనబడుతుంది?

"కరెంటు బిల్లు" చేతికందగానే!

* * *

మనిషికి "చావు" లేకపోతే...?

"స్మశానాలు" "ఫ్లాట్స్"గా చేసి అమ్ముకోవచ్చు!

❀

సమాధానాన్నే కోరుకుంది కోకిల...విశ్వం చేసిన బోధే కోకిల ఇంత ఎత్తుకు ఎదగడానికి కారణం.

అమ్మాయిలు, ఇలాగే వుండాలని చెప్పిన దానికి అనుకూలంగా తనను మలుచుకుంది కోకిల.

రసాయనిక మార్పులా విశ్వం బోధనలు కోకిలను పూర్తిగా మార్చి వేసినా మారనిది ఆమె మనసు.

"అమ్మా కోకిలా! జీడిపప్పు కిస్‌మిస్ పళ్ళు బాగు చేసి. యాలక్కాయలు పొడి కొట్టి ఇయ్యమ్మా పాయసానికి...విశ్వం వచ్చేంతలోగా వంట పూర్తవ్వాలమ్మా కోకీ..." అన్న అమ్మ పిలుపుకు కట్టుబడిన కూతురు "ఇదిగో వస్తున్నానమ్మా..."అని కోకిల వంటింట్లోకి వచ్చింది.

"వెరీగుడ్...వెరీగుడ్, వెరీ టేస్టీ...వంటలన్నీ చాలా రుచిగా వున్నాయి...మష్‌రూమ్ కట్‌లెట్ అద్భుతం..."అని వంటల్ని మెచ్చుకుంటున్నాడే కానీ విశ్వం కోకిల చదువును గురించి గానీ, ఆమె నేర్చుకున్న విశేషాంశాలను గురించిగానీ ఒక్క విషయం అడగలేదు...అసలామె వునికినే గమనించడం లేదు...అని కోకిలకు తెలుస్తూనే వుంది.

మష్‌రూమ్స్ ఇంత రుచిగా వుంటయ్యని నాకిప్పుడే తెలిసింది. బైదిబై కోకిలా మెరైన్ ఇంజనీరింగ్ పూర్తి చేశావుటగా. ప్రకృతి మీద కవితలు రాస్తున్నావుట. అబ్దుల్ కలామ్ గారితో చాట్ చేస్తున్నావుట..." కోకిల ఉత్సాహంగా లేదని గమనించి "వాట్ హ్యాపెండ్ కోకీ?" అన్నదానికి కోకిల ఓ చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

"నేనిచ్చిన ఇన్స్‌పిరేషన్‌తోనేగా నువ్వింత ఎత్తుకు ఎదిగావు కోకీ..."అన్న విశ్వం మేనమామ వైపు తిరిగి "మామయ్యా నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు విశ్వం.

"చెప్పు విశ్వం..." అన్నాడు సాంబశివయ్య కూతురుతో పెళ్లిముహూర్తం పెట్టించమంటాడనుకుంటూ.

"మామయ్యా! కామేశ్వరి అనే అమ్మాయిని అమ్మా నాన్నలు నా కోసం చూశారు..."అన్న విశ్వం మాటకి అక్కడందరికి నోటి మాట పడిపోయింది.

"నాన్నగారి దూరపు బంధువు కూడా. ఎస్.ఎస్.ఎల్.సీ వరకూ చదువుకుంది. ముగ్గులు, అల్లికలు వచ్చు. వంట బాగా చేస్తుంది. ఇంటి పని ఇంటి నిర్వాకము అన్నీ బాగా తెలుసు. దేవుడి భక్తి చాలా ఎక్కువ. వ్రతాలు పూజలు అంటే బాగా నమ్మకం. భార్య అంటే ఎలా వుండాలని నేను అనుకున్నానో...అదే మాదిరిగా వుంది కాముడు..."అన్న విశ్వం మాటలకి సాంబశివయ్యకి మూర్ఛ వచ్చినట్లుగా వుంది.

"కోకీ ఇంకో కట్‌లెట్ వెయ్యి...రియల్లీ వెరీ డెలిషియస్..."అన్న విశ్వం మాటలు కోకిలకు వినిపించలేదు.

"భార్య ఎలా వుండాలనుకున్నానో అలాగే వుంది కాముడు" అని విశ్వం అన్న మాటలే ఆమె మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి.

❀